వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

సమగ్ర కులగణన చేపట్టాలి

- రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఆమనగల్లు, ఆగస్టు 27: రాష్ట్రంలో తక్షణమే బీసీల సమగ్ర కులగణన చేపట్టాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కు మార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ బీసీ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ రెండో తేదీన రాష్ట్రంలో సమగ్ర కులగణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాలని కల్వకుర్తి పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం భవనంలో నిర్వహించనున్న బీసీ మహాధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్లను మంగళవారం వారు వేర్వేరుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య, ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి బహిరంగ సభలో బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ప్రభుత్వానికి బీసీలపై ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు.

అనంతరం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ బీసీ మహాధర్నాకు బీసీలు అధికంగా హాజరై సక్సెస్ చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్, నాయకులు కృష్ణ, అనిల్, మహేశ్, గణేష్, సాయి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను కట్టడి చేయాలి

- రంగారెడ్డి కలెక్టర్ శశాంక
- కొండాపూర్‌లోని ఏరియా దవాఖాన తనిఖీ
- రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

రంగారెడ్డి, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ) : డెంగీ, మలేరియాతోపాటు ఇతర సీజనల్ వ్యాధుల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కొండాపూర్‌లోని ఏరియా దవాఖానను ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ వైద్య సిబ్బందితోపాటు పేషెంట్లకు సంబంధించిన వార్డులను కలియతిరిగి పరిశీలించారు. దవాఖానలకు వచ్చే రోగులకు సరైన వైద్యం అందించాలని, ఏరియా దవాఖాన పరిధిలోని ప్రజలకు సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఏరియా దవాఖానకు ప్రతిరోజూ సగటున ఎంత మంది రోగులు వస్తున్నారు ?. వారిలో ఎంత మంది ఇన్ పేషంట్లుగా అడ్మిట్ అవుతున్నారు ?. డెంగీ, మలేరియా, విషజ్వరాలు వంటి వాటితో ఎంతమంది చికిత్స పొందుతున్నారనే వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా రోగులను పలకరించి అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. రోగులకు పరీక్షలు నిర్వహించి వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్లలో నమోదు చేయాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. తనిఖీలో డాక్టర్ రాజు, డీసీహెచ్ఎస్ డాక్టర్ అనురాగి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రకృష్ణ ఆర్ఎంవో డాక్టర్ సుధాకర్, సీఎస్ జనరల్ మెడికల్ హేమలత న్యూరో సూపరింటెండెంట్ హెప్సిభా, ఇన్ఫెక్షన్ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ అపర్ణ, టీ-హబ్ ఇన్‌చార్జి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొండాపూర్‌లోని ఏరియా దవాఖానలో వైద్యులతో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

ఆంక్షల్లేకుండా రుణమాఫీ చేయాలి

నిబంధనలు ఎత్తేసి రూ.2 లక్షల వరకు రుణమాఫీని తక్షణమే అమలు చేయాలని రంగారెడ్డి జిల్లా రైతు సంఘం ప్రభుత్వాన్ని డి మాండ్ చేసింది. తెలంగాణ రాష్ట్ర రైతు సం ఘం ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం జిల్లా రైతు సంఘం కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ అధ్యక్షుడు మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభులింగం మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పంట రుణాలను ఎలాంటి ఆంక్షల్లేకుండా మాఫీ చేయాలన్నారు. రుణాలు మాఫీ కాని అన్నదాతలు జిల్లాలో వేల సంఖ్యలో ఉన్నారని.. వారంతా తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. రూ. 2 లక్షల పైబడి అప్పు ఉన్న రైతుల విషయంలో స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. ధర్నాలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

60 కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు.. పరారీలో మరొకరు
- వివరాలు వెల్లడించిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు

ఇబ్రహీంపట్నం రూరల్, ఆగస్టు 27 : ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న 60 కిలోల గంజాయిని ఇబ్రహీంపట్నం పోలీసులు మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసుల సహకారంతో పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని, రెండుఫోన్లు, రూ.1500 నగదును స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు.

వాల్మీక్‌కపూర్ అనే వ్యక్తి రవాణా వ్యాపారంలో తీవ్రంగా నష్టపో యి.. ఉన్న వాహనాన్ని కూడా విక్రయించా డు. దీంతో అతడు గంజాయిని అక్రమంగా మహారాష్ట్రలో విక్రయిస్తే అధిక లాభాలు వస్తాయని ఓ ప్లాన్ వేశాడు. ఇందుకోసం ఎంహెచ్03ఏఎం 9368 నంబర్ గల మారుతి షిఫ్ట్ కారును కొన్నాడు. తనకు పరిచయం ఉన్న దేవరామ్ అనే వ్యక్తితో కలిసి ఈనెల 25న ఆ కారులో విశాఖపట్నం జిల్లాలోని పెందుర్తి గ్రామానికెళ్లి తిరుపతి అనే వ్యక్తి వద్ద 60 కిలోల గంజాయిని కొన్నారు. దానిని 30 ప్యాకెట్లలో నింపుకొని ఆ కారులో ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరం నుంచి విజయవాడ, సూర్యాపేట, చౌటుప్పల్ నుంచి ఇబ్రహీంపట్నం మీదుగా మహారాష్ట్రలోని నాసిక్‌కు అక్రమంగా తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసుల సహకారంతో రాయపోల్ సమీపంలోని తాళ్లపల్లిగూడ గేటు సమీపంలో కారులో తనిఖీలు చేపట్టి ఇద్దరు వ్యక్తులతోపాటు 60 కిలోల గంజాయి, రెండుఫోన్లు, రూ.1500 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీపీ చెప్పారు. గంజాయిని పట్టుకున్న పోలీసులను అభినందించారు.

హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ యాక్టు కేసులో

నిందితుడికి జీవిత ఖైదు

తీర్పు ఇచ్చిన ఎల్‌బీనగర్ స్పెషల్ సెషన్స్ కోర్టు జడ్జి

వికారాబాద్, ఆగస్టు 27: హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ యాక్టు కేసులో నిందితుడికి జీవిత ఖైదు శిక్షతోపాటు రూ. వెయ్యి జరిమానాను ఎల్‌బీనగర్ స్పెషల్ సెషన్స్ కోర్టు విధించినట్లు ఎస్పీ నారాయణరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే.. యాలాల మండలంలోని విశ్వనాథ్‌పూర్ గ్రామానికి చెందిన నింగగాళ్ళ అంబరప్ప ఎస్సీ కులానికి చెందినవాడు. కాగా అదే గ్రామానికి చెందిన షేక్‌మహబూబ్, అంబరప్ప కలిసి మెలిసి ఉంటూ కూలీపనితోపాటు డ్రైవింగ్ చేసుకుంటూ జీవించేవారు. కాగా ఇరువురి మధ్య కొన్ని విషయాల్లో మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో 15.06.2020న అంబరప్ప కోడలు వెంకటమ్మ, మనుమడు నవీన్ రోడ్డుపై వెళ్తుండగా.. మార్గమధ్యంలో షేక్ మహబూబ్ తమ్ముడు షేక్ హైమద్ వారిద్దరిని కులం పేరుతో తిట్టుకుంటూ.. తన వెంట తెచ్చుకున్న కత్తితో నవీన్‌పై దాడి చేశాడు. దీంతో అంబరప్ప ఈ విషయంపై యాలాల ఠాణాలో ఫిర్యాదు చేయగా పోలీసులు హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును అప్పటి తాండూరు డీఎస్పీ లక్ష్మీనారాయణ దర్యాప్తు చేసి, కోర్టు ముందు కేసు వివరాలు ఉంచారు. ప్రస్తుత డీఎస్పీ బాలకృష్ణారెడ్డి ఈ కేసుకు సంబంధించిన ట్రయల్స్‌ల్లో ఎక్కడా జాప్యం కాకుండా చర్యలు తీసుకున్నారు. అనంతరం వాదోపవాదనలు విన్న తర్వాత స్పెషల్ సెషన్స్ కోర్టు జడ్జి భవాని మంగళవారం నిందితుడు షేక్ హైమద్‌కు జీవితఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పుఇచ్చారు. నిందితుడికి శిక్ష పడేలా చర్యలు తీసుకున్న ఐవో (అదనపు డీసీపీ) లక్ష్మీనారాయణ, ప్రస్తుత డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, ఏపీపీ ప్రతాప్‌రెడ్డి, సీడీవో శ్రీశైలం, శ్రీనివాస్‌గౌడ్‌లను ఎస్పీ అభినందించారు.

కూరగాయల మార్కెట్లో

సమస్యలు పరిష్కరించాలి

మార్కెట్ పరిసరాలను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి

వికారాబాద్, ఆగస్టు 27 : కూరగాయల మార్కెట్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వికారాబాద్ ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. మంగళవారం ఆమె వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని మార్కెట్, రైతుబజార్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాన్ని పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో..కూరగాయలు విక్రయించే రైతులకు రైతుబజార్ లోపల స్థలం లేకపోవడంతో రోడ్డుపై అమ్ముకుంటున్నారని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారమేశ్ వివరించారు. దీని వల్ల క్రయ, విక్రయదారులు, అటుగా వెళ్లే వాహనదారులకు అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. కూరగాయల మార్కెట్ మొత్తం బురదమయంగా మారిందని, ఆ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆమె మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీదేవీసదానంద్ రెడ్డి, నాయకులు సదానంద్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌చార్జి ఏసు, ఇంజినీర్ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వికారాబాద్ ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి

రెండో విడత దళితబంధు నిధులు విడుదల చేయాలి

రెండో విడత దళితబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని దళితబంధు సాధన సమితి వికారాబాద్ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో దళితబంధు సాధన సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అనంతరం అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ..కలెక్టర్ ఆధ్వర్యంలో దళితబంధు రెండోవిడత లబ్ధిదారులను ఎంపిక చేసి దళితబంధు అకౌంట్, బెనిఫిషర్ ఐడీలు కూడా తీశారని.. అయితే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రెండో విడత లబ్ధిదారులకు నిధులు విడుదల చేయాలని..లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో దళితబంధు సాధన సమితి జిల్లా సలహాదారులు ముజాహిద్‌పూర్ పెంటయ్య, రామన్న మాదిగ, వెంకటన్న, అశోక్, శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు. -వికారాబాద్, ఆగస్టు 27

ప్రతి రైతుకూ రుణమాఫీ జరుగుతుంది

రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు

మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు

మొయినాబాద్, ఆగస్టు 27 : ప్రతి రైతుకూ పంట రుణాల మాఫీ జరుగుతుందని రంగారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ అధికారి నర్సింహారావు అన్నారు. మండలంలోని రైతువేదికలో ప్రతి మంగళవారం జరిగే రైతునేస్తంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన పలువురు రైతులు అన్ని అర్హతలున్నా మా పంట రుణాలు మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి రైతుకూ రుణ మాఫీ వర్తిస్తుందని.. ఎవరూ ఆందోళన చెందొద్దన్నారు. సాంకేతిక లోపంతో కొందరి రుణాలు మాఫీ కావడంలో ఆలస్యం జరిగిందన్నారు. రుణాలు మాఫీ కాని రైతులు వ్యవసాయ అధికారుల వద్దకెళ్లి ఆన్‌లైన్‌లో చెక్ చేసుకోవాలని.. అప్పటికీ మాఫీ కాకుంటే వ్యవసాయ అధికారులు అడిగిన పత్రాలను ఇస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు. ప్రతి మంగళవారం జరిగే రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొని వ్యవసాయ శాస్త్రవేత్తల ఇచ్చే సలహాలు, సూచనలు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారిణి అనురాధ, ఏఈవోలు కుమార్, సునీల్, రైతులు పాల్గొన్నారు.

ఎల్కగూడలో నిలిపిన కారు నుంచి బ్యాటరీని తస్కరిస్తున్న దొంగలు

కారులో వస్తూ..

వాహనాల బ్యాటరీలు తస్కరిస్తూ..

- గత కొన్ని రోజులుగా మండలంలో గుర్తు తెలియని దొంగల హల్‌చల్
- సీసీ ఫుటేజీలను సేకరించిన మొయినాబాద్ పోలీసులు

మొయినాబాద్, ఆగస్టు 27: దొంగలు అర్ధరాత్రి సమయాల్లో కారులో వస్తూ.. గ్రామాల్లో రోడ్ల పక్కన నిలిపిన కార్లు, ఆటోలు, ట్రాక్టర్లలోని బ్యాటరీలను తస్కరిస్తున్నారు. మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి ప్రకారం.. మండలంలోని ఎల్కగూడ, రెడ్డిపల్లి గ్రామాల్లో ట్రాక్టర్లు, ఆటోలు, కార్ల బ్యాటరీలను గుర్తు తెలియని దుండగులు చోరీ చేస్తున్నారు. ఎల్కగూడలో గుడుపల్లి రాజుకుండె శ్రీనివాస్, ఆలూరి వెంకటేశ్ ఆటో, జగదీశ్ కార్ల నుంచి బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. అదేవిధంగా రెడ్డిపల్లి గ్రామంలో కమల్, ఇంద్రసేనారెడ్డి ట్రాక్టర్ల నుంచి బ్యాటరీలు, ఆంజనేయులు ఆటో నుంచి బ్యాటరీని అపహరించారు. గత నెల రోజుల కిందట రాఘవరెడ్డి, శేరి శ్రీనివాస్, ఎర్ర యాదయ్య, ఇంద్రసేనారెడ్డిలకు చెందిన ట్రాక్టర్ల బ్యాటరీలను దొంగిలించారు. బాధితులు మంగళవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు. దొంగతనం ఎవరు చేస్తున్నారో సీసీ ఫుటేజీలను సేకరించారు. ఇద్దరా కారులో వచ్చి వాహనాల బ్యాటరీలను దొంగిలి స్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు.

వికారాబాద్ ప్రభుత్వ దవాఖానలో ఓపీ కోసం బారులుదీరిన రోగులు

ఒక్క నెలలో 13 డెంగీ కేసులు

- సీజనల్ వ్యాధులతో రోగాల బారిన పడుతున్న ప్రజలు
- దవాఖానలో బెడ్లు లేక ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయిస్తున్న రోగులు

వికారాబాద్, ఆగస్టు 27 : సీజన్ వ్యాధులతోపాటు, వాతావరణ మార్పుల వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. వికారాబాద్ మండలంతోపాటు ధారూరు, మర్పల్లి, మోమిన్‌పేట, పూడూరు, నవాబుపేట, కోట్‌పల్లి, బంట్వారం మండలాలకు చెందిన ఆయా గ్రామాల ప్రజలు అస్వస్థతకు గురవుతున్నారు. మంగళవారం వికారాబాద్ ప్రభుత్వ దవాఖానకు వందల సంఖ్యలో రోగులు వచ్చారు. దీంతో దవాఖాన అంతా రోగులతో నిండిపోయింది. 50 పడకల దవాఖాన కావడంతో రోగులకు సరిపడా బెడ్లు లేక ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. బెడ్లు లేకపోవడంతో చాలామంది రోగులు ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయిస్తున్నారు. ఒక్క నెలలోనే 13 డెంగీ కేసులు నమోదయ్యాయని వైద్యులు పేర్కొన్నారు. రోజు రోజుకూ రోగుల సంఖ్య పెరుగుతున్నా దవాఖానలో మాత్రం బెడ్ల సంఖ్యను పెంచడంలేదని రోగులు మండిపడుతున్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మాత్రమే ఓపీ చూడడంతో.. దూరప్రాంతాల నుంచి వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారని.. ఓపీ సమయాన్ని మరింత పెంచాలని పలువురు కోరుతున్నారు.

350 పడకల దవాఖానను ప్రారంభించాలి

రోజురోజుకూ రోగుల సంఖ్య పెరుగుతున్నది. సరిపడా వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు. 50 పడకల దవాఖాన కావడంతో రోగులకు సరిపడా బెడ్లు అందించలేకపోతున్నాం. ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులకు చికిత్స అందిస్తున్నాం. రోగుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా పట్టణంలోని 350 పడకల దవాఖానను ప్రారంభిస్తే బాగుంటుంది. రోగులకు సరిపడా బెడ్లు అందుబాటులో ఉంటాయి. అందరికీ మెరుగైన వైద్యాన్ని అందించొచ్చు.

- డాక్టర్ రామచంద్రయ్య, సూపరింటెండెంట్, వికారాబాద్

లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన

పాల్గొన్న సిటీ కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

సిటీబ్యూరో, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్(హెచ్‌సీఎస్‌సీ) ఆధ్వర్యంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పాష్)పై రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీలో మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, మహిళా భద్రత డైరెక్టర్ శిఖా గోయెల్, ప్రభుత్వ కార్యదర్శి, మహిళా, శిశు అభివృద్ధి శాఖ కమిషనర్ వాకాటి కరుణ, హెచ్‌సీఎస్‌సీ సెక్రటరీ జనరల్ శేఖర్‌రెడ్డి, మహిళా భద్రత డీసీపీ దార కవిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్క్‌షాపునకు హాజరైన ప్రముఖులు మాట్లాడుతూ.. హెచ్‌సీఎస్‌సీ కార్యాలయాలు, సంస్థలు, కమ్యూనిటీల్లో లైంగిక వేధింపులకు సంబంధించిన అంశాలపై వరుసగా వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేధింపుల నిరోధక చట్టం 2013 గూర్చి వివిధ సంస్థల అంతర్గత కమిటీ సభ్యులకు అవగాహన కల్పించడం ద్వారా చట్టంపై అవగాహన పెరగడం, దానిని సమర్థవంతంగా అమలు చేయడానికి ఈ కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. అన్ని సంస్థలలో అంతర్గత కమిటీల ఏర్పాటు తప్పనిసరి చేయడం వల్ల ఉద్యోగులకు, ప్రధానంగా మహిళలకు సురక్షితమైన వాతావరణం ఏర్పడుతుందని సూచించారు.

మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకుడు

చేవెళ్లటౌన్, ఆగస్టు 27 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రణయ్, శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కమిటీ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించొద్దని ప్రభుత్వానికి సూచించారు. సర్కారు బడుల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని తీసుకొచ్చిన తర్వాతే చిన్నారులకు పౌష్టికాహారం అందుతున్నదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకానికి బడ్జెట్‌లో నిధులను పెంచాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ మెంబర్, జిల్లా ఉపాధ్యక్షుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్ కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పీఎం రాష్ట్రీయ బాల పురస్కార అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

వికారాబాద్, ఆగస్టు 27 : పీఎం రాష్ట్రీయ బాల పురస్కార అవార్డులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వికారాబాద్ జిల్లా సంక్షేమశాఖ అధికారిణి కృష్ణవేణి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 5-18 ఏండ్లలోపు ఉన్న బాలబాలికలు.. సోషల్‌సర్వీస్, క్రీడలు, ధైర్య సాహసాలు, పర్యావరణం, కళలు, సైన్స్ అండ్ టెక్నాలజీ వంటి రంగాల్లో ప్రావీణ్యం కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో జాతీయ అవార్డు పోర్టల్ awards.gov.in లో ఆగస్టు 31లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం ఆ జిరాక్స్ కాపీని జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు.